ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
7
పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
గురువారం 16 అక్టోబరు 2025



వసతి గృహాల అభివృద్ధికి నిధులు

మక్కువ రూరల్, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ పరిధిలో వసతిగృహాల అభివృద్ధికి ప్రభుత్వం రూ.90కోట్లు మంజూరు చేసిందని పార్వతీపురం ఐటీడీఏ గిరిజన సంక్షేమ శాఖ డీడీ విజయశాంతి తెలిపారు. బుధవారం మూలవలసలో ఆమె విలేఖర్లతో మాట్లాడుతూ.. అనారోగ్యాలతో వరుసగా గిరిజన విద్యార్థులు మరణిస్తుండడం బాధాకరమన్నారు. వసతి గృహాలు, ఆశ్రమపాఠశాలల్లో తాగునీరు, ఇతర మౌలిక సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. జిల్లాలో పరిస్థితిపై అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక పంపుతామని తెలిపారు.

మరణ మృదంగం

- మన్యంలో ఆగని గిరిజన విద్యార్థుల మరణాలు
- 20 రోజుల్లో నలుగురు మృత్యువాత
- అనారోగ్య సమస్యలే కారణం
- కన్నవారికి కడుపుకోత.. సర్వత్రా ఆందోళన
- ప్రభుత్వం ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలంటున్న జిల్లా ప్రజలు

పార్వతీపురం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి):

జిల్లాలో గిరిజన విద్యార్థుల మరణాలు ఆగడం లేదు. గత 20 రోజుల్లో నలుగురు మృత్యువాత పడడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. కాగా కారణాలేమైనా కన్నవారికి కడుపుకోత తప్పడం లేదు. బాగా చదివి.. కుటుంబాలను ఆదుకోవాల్సిన వారు విగతజీవులుగా మారడం కలకలం రేపుతోంది. అనారోగ్య సమస్యలతోనే అత్యధికంగా గిరిజన విద్యార్థులు మృతి చెందడం కలవరపరుస్తోంది. ఇకనైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించకపోతే పరిస్థితి మరింతగా విషమించే అవకాశముంది.

ఇదీ పరిస్థితి..

కురుపాం గురుకుల పాఠశాలకు చెందిన ఇద్దరు గిరిజన విద్యార్థినులు పచ్చకామెర్లతో బాధపడుతూ ఇటీవల మృతి చెందారు. మిగతా వారిలో కొందరు పార్వతీపురం జిల్లా కేంద్రాసుపత్రిలో, ఇంకొందరు విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ కోలుకున్నారు. వారిలో కొంతమంది ఇళ్లకు చేరుకున్నారు. ఈ ఘటనను మరువకముందే.. సాలూరు మండలం మామిడిపల్లికి చెందిన ఒక విద్యార్థిని ఈ నెల 12న కేజీహెచ్‌లో మృతి చెందింది. తాజాగా మక్కువ మండలం చెందిన ఎర్రసామంతవలస ఆశ్రమ పాఠశాలకు చెందిన చిన్నారి అనే గిరిజన విద్యార్థి కేజీహెచ్‌లో మృతి చెందాడు. మొత్తంగా గత నెల 25 నుంచి ఇప్పటివరకు ముగ్గురు విద్యార్థినులు, ఒక విద్యార్థి మృతి చెందారు.

గత వైసీపీ హయాంలో..

గత ఐదేళ్లలో ఎంతోమంది గిరిజన విద్యార్థులు మరణించినా గత వైసీపీ సర్కారు పట్టించుకోలేదు. కనీసం బాధిత కుటుంబా లకు ఎక్స్‌గ్రేషియా కూడా మంజూరు చేయలేదు. పైగా టీడీపీ ప్రభుత్వ కాలంలో ఆశ్ర మపాఠశాలల్లో నియమించిన ఏఎన్‌ఎంలను పూర్తిగా తొలగించింది. దీంతో విద్యార్థుల ఆరోగ్యంపై పర్యవేక్షణ కొరవడింది. కాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏఎన్‌ఎంల ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అయితే వారి నియామకంలో ఇప్ప టివరకు ఏ నిర్ణయం తీసుకోలేదు. తక్షణమే నియామక చర్యలు తీసుకుంటే.. విద్యార్థుల మరణాలకు అడ్డుకట్ట పడుతుందనే వ్యాఖ్యలు సర్వత్రా వినిపిస్తున్నాయి.



చిన్నారి మృతదేహం వద్ద తల్లిదండ్రులు

పర్యవేక్షణ లోపం..

జిల్లాలో ఉన్న ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపడం లేదు. వాస్తవంగా అనారోగ్యానికి గురైన విద్యార్థులను గతంలో సిక్ రూముల్లో ఉంచి వైద్యం అందించేవారు. ఇప్పుడైతే అత్యధిక గిరిజన విద్యాలయాల్లో ఆ పరిస్థితి లేదు. తల్లిదండ్రులు ఒప్పుకోవడం లేదని, కొంతమంది ఆశ్రమ పాఠశాలలో నిర్వాహకులు పిల్లలను స్వగ్రామాలకు పంపించేస్తున్నారు. దీంతో సరైన వైద్యం అందక కొందరు.. నాటు వైద్యం, మూఢనమ్మకాలకు తల్లిదండ్రులు ప్రాధాన్యం ఇవ్వడంతో మరికొందరు విద్యార్థులు మృత్యువాతపడుతున్నారు. కనీసం సచివాలయ ఏఎన్‌ఎంలకు కూడా సమాచారం అందించడం లేదు. సంచి వైద్యులను ఆశ్రయిస్తూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. దీనిపై ప్రభుత్వం స్పందించి గిరిజన విద్యాలయాల్లో పర్యవేక్షణ పెంచి, విద్యార్థులకు సకాలంలో వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘాల నాయకులు కోరుతున్నారు.

మరో విద్యార్థి మృతి

- ఆసుపత్రిలో చికిత్స పొందినా దక్కని ఫలితం
- కన్నీరుమున్నీరవుతున్న తల్లిదండ్రులు



చిన్నారి (ఫైల్)

మక్కువ రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మక్కువ మండలం ఎర్రసామంతవలస గిరిజన ఆశ్రమ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న తాడంగి చిన్నారి(10) అనా రోగ్యంతో మృతి చెందాడు. ఆసు పత్రిలో చికిత్స పొందినప్పటికీ ఫలితం లేకపోయింది. బుధవారం వేకువజామున మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మూలవలస గ్రామానికి చెందిన తాడంగి ముగిరి, కాంతమ్మ పోడు వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నారు. వారికి ఇద్దరు సంతానం. ఏడేళ్ల భూమిక అదే గ్రామంలోని అంగన్ వాడీ కేంద్రానికి వెళ్తుంది. ఇక చిన్నారి ఎర్రసామంతవలస గిరిజన ఆశ్రమ పాఠశాలలో చదువు కొనసాగిస్తున్నాడు. అయితే గత నెల22న ఆ విద్యార్థి దసరా సెలవుల నిమిత్తం ఇంటి కొచ్చాడు. సెలవులు పూర్తయినా పాఠశాలకు తిరిగి వెళ్లలేదు. దీంతో ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థి తల్లిదండ్రులకు కబురు పంపారు. చిన్నారిని వెంటనే స్కూలుకు పంపాలన్నారు. అయితే అప్పటికే జ్వరంతో బాధపడుతున్న విద్యార్థికి ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించాలని వారు సూచించారు. దీంతో తల్లిదండ్రులు చిన్నారితో కలిసి ఈ నెల 8న శంబర పీహెచ్‌సీకి వెళ్లి వైద్యపరీక్షలు చేయించుకున్నారు. అయితే విద్యార్థికి మలేరియా ఉన్నట్లు తేలడంతో అదే రోజున పార్వతీపురం జిల్లాకేంద్రాసుపత్రిలో చేర్పించారు. బాలుడి ఆరోగ్య పరిస్థితి మెరుగు పడడంతో 9న వైద్యులు డిశ్చార్జి ఇచ్చారు. దీంతో చిన్నారి ఇంటికి చేరుకున్నాడు. 10న పాఠశాలలో చేరాడు. రెండు రోజులు ముగిసిన తరువాత 12న కడుపు నొప్పిగా ఉందంటూ వాంతులు

(మిగతా 8వ పేజీలో...)

శాయశక్తులా కృషి చేశాం..

పార్వతీపురం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): 'ఎర్రసామంతవలస ఆశ్రమ పాఠశాల విద్యార్థిని కాపాడడానికి శాయశక్తులా కృషి చేశాం. అయితే ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చిన్నారి మృతి చెందడం బాధాకరం.' అని డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఈసారైనా అర్హులెవరో తేలుస్తారా?

- దివ్యాంగ పింఛన్ల పునఃపరిశీలన ప్రారంభం
- తొలివిడతగా 1863 మందికి ఆసుపత్రుల్లో తనిఖీలు



పార్వతీపురం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో దివ్యాంగ పింఛన్ల పునఃపరిశీలన ప్రక్రియ ప్రారంభమైంది. ఆ మేరకు బుధవారం పార్వతీపురం, పాలకొండ, సాలూరుతో పాటు విజయ నగరం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో లబ్ధిదారులకు వైకల్య నిర్ధారణ పరీక్షలు జరిపారు. వాస్తవంగా ఈ ఏడాది జనవరి నుంచి మే వరకు నాలుగు వైద్య బృందాలు దివ్యాంగ పింఛన్‌దారుల తనిఖీలు చేపట్టాయి. సుమారు 8వేల మంది వైకల్య శాతం, సదరం ధ్రువీకరణ పత్రాలను పరిశీలించాయి. అయితే వారిలో 2,884 మందికి పైగా వైకల్య శాతంలో లోపాలు ఉన్నట్లు గుర్తించి నోటీసులు జారీ చేశారు. పింఛన్లు నిలుపుదల చేస్తామనడంతో దివ్యాంగ పింఛన్‌దారులు తీవ్ర ఆందోళన చెందారు. అయితే ప్రభుత్వం యథావిధిగా అందరికీ పింఛన్లు పంపిణీ చేయడంతో వారు ఊపిరిపీల్చుకున్నారు. ఇటీవల రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మళ్లీ వారికి సచివాలయాల సంక్షేమ కార్యదర్శులు, వెలుగు సిబ్బంది ద్వారా నోటీసులిచ్చారు. తొలి విడతగా 1863 మందికి పరీక్షలు నిర్వహించనుండగా.. ప్రస్తుతం ఆసుపత్రుల్లో తనిఖీలు చేపడుతున్నారు. దీంతో అనర్హులైన దివ్యాంగ పింఛన్‌దారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. కాగా వినికిడి లోపం, మానసిక వైకల్యం కలిగిన వారికి విజయనగరంలో, దృష్టిలోపం ఉన్న వారు, ఇతర దివ్యాంగులకు పార్వతీపురం, పాలకొండ, సాలూరు, విజయనగరం ఆసుపత్రుల్లో పరీక్షలు నిర్వహిస్తున్నారు. అయితే ఈసారైనా అనర్హులను తొలగించి అర్హులైన వారికి పింఛన్లు అందిస్తారో లేక అందరికీ దివ్యాంగ పింఛన్లు కొనసాగిస్తారో వేచి చూడాల్సి ఉంది.

ఇదీ పరిస్థితి..

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇష్టారాజ్యంగా దివ్యాంగుల పింఛన్లు మంజూరు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. వైసీపీ నాయకులు, కార్యకర్తల సూచనలతో అనర్హులకు పెద్దపీట వేశారు. అర్హులైన దివ్యాంగులకు తీవ్ర అన్యాయం చేశారు. వాటిపై పెద్దఎత్తున ఫిర్యాదులు వెల్లువెత్తడంతో కూటమి ప్రభుత్వం దివ్యాంగ పింఛన్ల పరిశీలనకు ఆదేశాలిచ్చింది. కాగా తొలివిడతలోని కొన్ని కేంద్రాల్లో జరిపిన వైద్య పరీక్షలపై విమర్శలొచ్చాయి. అర్హులను కూడా అనర్హులుగా చూపించి గందరగోళ పరిస్థితిని సృష్టించారు. దీంతో అర్హులైన దివ్యాంగుల పింఛన్లు కూడా రద్దయ్యాయి. దీనిపై కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌లో లబ్ధిదారులు ఫిర్యాదు చేశారు. ఈ పరిస్థితిని చక్కదిద్ది అర్హులకు న్యాయం చేసేందుకు ప్రభుత్వం మరోసారి దివ్యాంగుల పింఛన్ల పరిశీలనకు ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం ప్రభుత్వ ఆసుపత్రుల్లో దివ్యాంగ పింఛన్‌దారులకు వైకల్య పరీక్షలు జరుపుతున్నారు. అయితే ఇప్పటికైనా అర్హులైన వారిని గుర్తించి పింఛన్లు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లావాసులు కోరుతున్నారు. దీనిపై డీఆర్‌డీఏ పీడీ సుధారాణిని వివరణ కోరగా.. 'దివ్యాంగ పింఛన్‌దారులకు ఆసుపత్రుల్లో తనిఖీలు ప్రారంభమయ్యాయి. వారి వైకల్య శాతం బట్టి అర్హులైన వారందరికీ పింఛన్లు కొనసాగుతాయి.' అని తెలిపారు.

నేడు కురుపాం పాఠశాల పునఃప్రారంభం

కురుపాం, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): కురుపాం గురుకుల పాఠశాల గురువారం పునఃప్రారంభం కానున్నట్లు ప్రిన్సిపాల్ విజయలక్ష్మి తెలియజేశారు. బుధవారం ఆమె స్థానిక విలేఖర్లతో మాట్లాడుతూ.. ప్రస్తుతం విద్యార్థినులు జాండీస్ నుంచి బయటపడుతున్నారన్నారు. కొత్త వాటర్ ఫిల్టర్లు , మరో 40 మరుగుదొడ్లు ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఇప్పటికే ఉన్న మరుగుదొడ్లను బాగు చేయించామని తెలిపారు. గురుకులంలో పారిశుధ్యం కూడా మెరుగుపర్చామన్నారు. ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి, కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు హాజరు కానున్నట్లు వెల్లడించారు. ఏదేమైనా దసరా సెలవుల అనంతరం ఎట్టకేలకు గురుకులం పునఃప్రారంభిస్తున్నారు.



45 వేల సుకన్య సమృద్ధి ఖాతాలు

- పోస్టల్ సూపరింటెండెంట్ బాబూరావు



సాలూరు, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సుకన్య సమృద్ధి యోజన ఖాతాలు 45వేలకు చేరాయని పార్వతీపురం పోస్టల్ సూపరింటెండెంట్ ఆర్.బాబూరావు తెలిపారు. పట్టణంలో పోస్టల్ కార్యాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ముందుగా రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ.. పార్వతీపురం, బొబ్బిలిలో 405 బ్రాంచి పోస్టాఫీ సులు, 38 సబ్ పోస్టాఫీసులు ఉన్నాయన్నారు. ఆడ పిల్లల కోసం కేంద్ర సర్కారు ప్రత్యేకంగా సుకన్య సమృద్ధి యోజన పథకం అమలులోకి తెచ్చిందని వెల్లడించారు. రూ.250తో ఖాతా ప్రారంభిం చొచ్చని, 15 సంవత్సరాల వరకు ఎంతో కొంత కట్టొచ్చని తెలిపారు. ఆ తర్వాత 8.2 వడ్డీ రేటుతో అసలు మొత్తాన్ని చెల్లిస్తారన్నారు. చదువు, పెళ్లికోసమైతే మధ్యలోనే ఆ నగదు ఇస్తారని వివరించారు. ఇప్పటివరకు 3 లక్షల కుపైగా రికరింగ్ డిపాజిట్లు కలిగి ఉన్నట్లు చెప్పారు. పార్వతీపురం, చీపురుపల్లిలో ఏటీఎంలను నిర్వహిస్తున్నామన్నారు. ఆయన వెంట పోస్టల్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

9లో

పార్వతీపురంలో ఫొటోషూట్‌కు వెళ్తూ..
- రోడ్డు ప్రమాదంలో విజయనగరం యువకుడి మృతి
- నీలంపేట జంక్షన్ వద్ద ఘటన

నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్సులు రద్దు చేస్తాం
- బొబ్బిలి డీఎస్పీ భవ్యా రెడ్డి
- బాణసంచా వ్యాపారులతో సమావేశం

నియోజకవర్గానికి ఒక ఎంఎస్ఎంఈ పార్క్

- ఏర్పాటు చేయాలని కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి ఆదేశం

పార్వతీపురం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రతి నియోజకవర్గ పరిధిలో ఒక ఎంఎస్ఎంఈ (సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమలు) పార్క్ సిద్ధం కావాలని కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. గడువును నిర్దేశించుకొని ఆ సమయంలోగా వాటిని ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. జిల్లా నుంచి పది వేల మంది వ్యాపారవేత్తలు రావాలనాన్నరు. బుధవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. పీఎం ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాం మరింత బాగా జరగాలని ఆదేశించారు. ముందుగా అర్హత కలిగిన గ్రూప్‌లను ఎంపిక చేయాలని, వ్యాపారాలను గుర్తించి అందుకు తగిన విధంగా అవగాహన, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. డిగ్రీ, ఇంటర్ పాస్ వారితో పీఎంఈజీపీ శిక్షణ కోసం దరఖాస్తులు పెట్టించాలన్నారు. జిల్లాలో మలేరియాను పూర్తిగా అరికట్టాలని జిల్లా వైద్యాధికారులను కలెక్టర్ ఆదేశించారు. వారానికి ఒకసారి విధిగా డ్రైడే నిర్వహించాలన్నారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్ కరుణాకర్, డీఎంహెచ్‌వో భాస్కరరావు, డీఎంవో మణి తదితరులు పాల్గొన్నారు.

రహదారులపై చెత్త కనిపించరాదు

సాలూరు మున్సిపాలిటీలోని రహదారులపై చెత్త కనిపించరాదని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో మాట్లాడుతూ.. సాలూరులో నిరంతరం తాగునీరు సరఫరా ఉండాలని, ట్యాంక్‌లను సమయానుకూలంగా శుభ్రపరచాలని సూచించారు. పట్టణాన్ని అందంగా తీర్చిదిద్దాలన్నారు. అనంతరం రహదారులు, అన్నా క్యాంటీన్ తదితర వాటిపై సమీక్షించారు. నెడ్‌క్యాప్ వారితో మాట్లాడి సోలార్ లైట్స్ వేయించాలన్నారు. సూర్యఘర్ యూనిట్ల ర్పాటుపై ఆరా తీశారు. మున్సిపల్ కార్యాలయానికి అవసరమైతే ఎలక్ట్రికల్

(మిగతా 8వ పేజీలో...)



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి

గమ్మత్తుగా శస్త్రచికిత్స

- నొప్పి తెలియకుండా వైద్యం చేసేందుకు సాయం
- నేడు ప్రపంచ అనస్థీషియా దినం



పార్వతీపురం/విజయనగరం రింగురోడ్డు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నొప్పి అనేది మనిషి భయపడే అతి పెద్ద అనుభవం. ఇక శస్త్ర చికిత్స అంటే ఏ స్థాయిలో భయం ఉంటుందో చెప్పక్కరలేదు. అయితే ఎంత పెద్ద శస్త్ర చికిత్సనైనా నొప్పి తెలియకుండా చేసేం దుకు సాయపడుతోంది అనస్థీషియా (మత్తు). అనస్థీషియా అనే అద్భుత శాస్త్రం భయాన్ని తొలగించి.. సౌకర్యవంతంగా.. నొప్పిలేని చికిత్సగా మార్చింది. ఈ వైద్య విప్లవాన్ని గుర్తు చేసుకుంటూ ఏటా అక్టోబరు 16న 'ప్రపంచ అనస్థీషియా దినం'గా నిర్వహిస్తున్నారు.

అనస్థీషియా అంటే..

అనస్థీషియా అనే పదం గ్రీకు బాష నుంచి వచ్చింది. అనస్థీషియా అంటే స్పర్శ, నొప్పి వంటి అనుభూతులు లేకుండా చేయడం అన్న మాట. ఇది వైద్య పరంగా ఒక విధమైన ఔషధం లేదా సాంకేతిక ప్రక్రియ ద్వారా శస్త్ర చికిత్స సమయంలో రోగి నొప్పిని అనుభ వించకుండా చేస్తుంది. శరీరంలోని నిర్దిష్ట ప్రాంతంలో మాత్రమే నొప్పి లేకుండా ఉండేలా వైద్యులు నియంత్రిస్తారు.

భారతీయ ఆయుర్వేదంలో మూలాలు..

ఆధునిక అనస్థీషియా పుట్టుక 1846లో జరిగినా.. తన మూల భావన భారతీయ ఆయుర్వేదంలో వేల ఏళ్ల క్రితం నుంచే ఉంది. మన రుషులు నొప్పి నియంత్రణ, మూర్ఛ కలిగించడం, శస్త్ర చికిత్స వంటి అంశాలపై స్పష్టమైన వివరాలు ఇచ్చారు. క్రీస్తు పూర్వం 600లో సుశ్రుతుడు సుశ్రుత సంహిత గ్రంథంలో శస్త్ర చికిత్సపై గ్రంథం రచించారు. అందులో ఆయన రోగి నొప్పిని తగ్గించడానికి ముందుగా ' మందపాన' అంటే మద్యం లేదా మూలికలతో చేసిన నిద్ర, మూర్ఛ కలిగించే పానీయం ఇవ్వాలని సూచించారు. మహర్షి చెరకుడు తన 'చెరకు సంహిత' గ్రంథంలో శరీర నొప్పి నియంత్రణ కోసం సహజ మూలికల వినియోగాన్ని సూచించారు. సుశ్రుతుడిని భారతీయ వైద్యంలో అనస్థీషియా పితామహుడిగా పిలుస్తారు.

అనస్థీషియా రకాలు..

నేటి ఆధునిక వైద్యంలో అనస్థీషియా వివిధ రూపాల్లో అభివృద్ధి చెందింది. ఇందులో జనరల్ అనస్థీషియా, రీజనల్ అనస్థీషియా, లోకల్ అనస్థీషియా, సడేషన్ అనే రకాలు ఉన్నాయి. ప్రధాన శస్త్ర చికిత్సల్లో రోగిని పూర్తిగా స్పృహ కోల్పోయేలా చేయడాన్ని జనరల్ అనస్థీషియా అంటారు. శరీరంలోని ఒక భాగంలో మాత్రమే నొప్పి లేకుండా చేయడాన్ని రీజనల్ అనస్థీషియాగా చెబుతారు. చిన్న గాయాలు, దంత శస్త్ర చికిత్సల్లో లోకల్ అనస్థీ షియాని వినియోగిస్తారు. తక్కువ మోతాదులో మత్తు ఇచ్చి.. రోగి స్పృహ కోల్పోకుండా చేస్తారు. దీనిని సడేషన్ అంటారు. నేడు అధునాతన అనస్థీషియా ద్వారా గుండె మార్పిడి నుంచి మెదడు శస్త్ర చికిత్సల వరకూ నొప్పి లేకుండా

(మిగతా 8వ పేజీలో..)

హైడ్రో పవర్ ప్రాజెక్టు వద్దు 8లో
- పాచిపెంట తహసీల్దార్ కార్యాలయం ఎదుట గిరిజనుల నిరసన

తోటపల్లి ఆలయానికి రూ.5.15 లక్షల ఆదాయం 8లో

మన్యం పర్యాటక ప్రాంతాలపై రీల్స్ తయారీదారులకు బహుమతులు 8లో
- ఉత్తమ వీడియోల ఎంపిక

హైడ్రో పవర్ ప్రాజెక్టు వద్దు

● జీవో- 13 రద్దు చేయాలి ●పాచిపెంట తహసీల్దార్ కార్యాలయం ఎదుట గిరిజనులు నిరసన

పాచిపెంట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): హైడ్రో పవర్ ప్రాజెక్టు అనుమతులను తక్షణమే రద్దుచేయాలని గిరిజనులు డిమాండ్ చేశారు. ఈమేరకుబుధవారం పాచిపెంట తహసీల్దార్కార్యాలయం వద్ద హైడ్రో పవర్ ప్రాజెక్టు వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో గిరిజనులు నిరసన తెలిపారు. తొలుత ర్యాలీ నిర్వహించి అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించి తహసీల్దార్ డి.రవికి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం హైడ్రో పవర్ ప్రాజెక్టు వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ పవర్ ప్రాజెక్టు నిర్మాణంవల్ల సతాభి, తంగ్లాం, గిరిసిగుడ్డి, మూట కూడు, గొట్టూరు పంచాయతీల ఆదివాసీలు జలసమాధి అవుతారని తెలిపారు. గిరిజనుల అనుమతి లేకుండా డ్రోన్ల ద్వారా సర్వేచేసి రాళ్లు పాతుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నవయుగ కంపెనీకి ఇచ్చిన జీవో- 13ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘాల జిల్లా గౌరవవా ధ్యక్షుడు సీదరపు అప్పారావు, సీపీఎం మండల నాయకులు కోరాడ ఈశ్వరరావు, గిరిజన సర్పంచ్లు, గిరిజనులు పాల్గొన్నారు.


పాచిపెంట తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న గిరిజనులు

మరమ్మతులు లేక.. అధ్వానంగా మారి

●వర్షం కురిస్తే అవస్థలు ● ఇదీ కంబర - కాగితాడ రోడ్డు దుస్థితి


గోతులమయమైన కాగితాడ రహదారి

వీరఘట్టం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి):మండలంలోని కంబర నుంచి కాగితాడ వరకు ఉన్న రహదారి ఏళ్ల తరబడి కనీస మరమ్మతులకు నోచుకోకపోవడంతో అధ్వానంగా మారింది. కిలోమీటరు మేర అడుగడుగునా గోతులమయంకావడంతో పాదచారులు, వాహన చోదకులు అగచాట్లకు గురవుతున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా బురదమయంకావడంతో గోతుల్లో వాహనాలు కూరుకుపోతున్నాయి. 1500మంది జనాభాగల కంబర గ్రామస్థులతోపాటు కాగితాడ రైతుల పంట పొలాలకు ఈ రోడ్డు మీదుగానే వెళ్లాల్సిఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు గోతుల్లో నీరు చేరడంతో పంటపొలాలకు వెళ్లే సమయంలో పడి గాయపడుతున్నామని రైతులు వాపోతున్నారు. దీనికితోడు పంట ఉత్పత్తులను కల్లాలకు చేర్చేసమయంలో కూడా అవస్థలకు గురవుతున్నామని పలువురు చెబుతున్నారు. ఇప్పటికే ఈ రోడ్డు దుస్థితిని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ దృష్టికి స్థానిక నాయకులు పొదిలాపు కృష్ణమూర్తినాయుడుతోపాటు గ్రామస్థులు తీసుకువెళ్లారు. తక్షణమే రహదారిని అభివృద్ధి చేయాలని పలువురు కోరుతున్నారు.

రీల్స్ తయారీదారులకు బహుమతులు

● మన్యం పర్యాటక ప్రాంతాలపై చేసిన రీల్కు ప్రథమ బహుమతి

పార్వతీపురం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి):జిల్లాలోని పర్యాటక ప్రాంతాలు,జలపాతాలు, చారిత్రక ప్రదేశాలపై ఉత్తమ వీడియోలను తీసిన రీల్స్ తయారీదారులకు కలెక్టర్ డాక్టర్ ఎస్.ప్రభాకర్రెడ్డి బుధవారం బహుమతులు ప్రకటించారు. జిల్లావ్యాప్తంగా 38 మంది రీల్స్ తయారీదారులు 48 వీడియోలను వెబ్సైట్లో అప్లోడ్ చేయగా, ఐదింటిని ఎంపికచేశారు. త్వరలో వీరికి బహుమతులు ప్రదానం చేయనున్నారు.

●పార్వతీపురం నుంచి మర్రి రవి మన్యం పర్యాటక ప్రాంతాలపై చేసిన వీడియో ప్రథమ బహుమతికి ఎంపికకావడంతో రూ.ఐదు వేలు నగదు బహుమతి ఇవ్వనున్నారు. ● సాలూరు మండలంలోని గదబ, బొడ్వలస నుంచి కోన మహేష్ చిత్రీకరించిన మన్యం పర్యాటక ప్రాంతాల వీడియోకు ద్వితీయ బహుమతికి ఎంపిక కావడంతో రూ. మూడు వేలు నగదును అందజేయనున్నారు. ● సీతంపేటకు చెందిన కె.టెండ్యూకలర్ సీతంపేట అందాలపై చిత్రీకరించిన వీడియో తృతీయ బహుమతికి ఎంపికకావడంతో రూ.రెండు వేలు ఇవ్వనున్నారు. ● పార్వతీపురం మండలంలోని నర్సిపురం పంచాయతీ వెంకటరాయుడుపేట నుంచి మహతో ఇంద్రాణి మన్యం పర్యాటక అందాలపై చేసిన రీల్ కన్సొలేషన్ బహుమతికి ఎంపిక కాగా, పార్వతీపురం నుంచి పట్టాభి అనీల్కుమార్ ఆడలి వ్యూపాయింట్, లొద్ద జలపాతం, తోటపల్లిపై చిత్రీకరించిన రీల్కు సోషల్ మీడియా అంబాసిడర్గా కన్సొలేషన్ బహుమతికి ఎంపికయ్యాయి.

డేటా సెంటర్తో ఉద్యోగావకాశాలు

పార్వతీపురం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): డేటా సెంటర్ ఏర్పాటుతో ఉత్తరాంధ్ర రూపురేఖలే మారుతాయని, యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర తెలిపారు.విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుపై ఢిల్లీలో జరిగిన ఒప్పంద కార్యక్రమంలో ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర పాల్గొన్నారు.

గూగుల్తో ఒప్పందం చరిత్రాత్మకం

గరుగుబిల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు ఒప్పందం కుదుర్చుకోవడం చారిత్రాత్మకమని ఎంపీపీ ఉరిటిరామారావు తెలిపారు.మరుపెంటలో విలేకరులతో మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడుపై నమ్మకంతో పలు కంపెనీలు, సంస్థలు పెట్టుబడులను పెట్టేందుకు ముందుకువస్తున్నాయని చెప్పారు. ఉత్తరాంధ్రలో అభివృద్ధికి నూతనయుగం ప్రారంభమైందని, ప్రపంచ పటంలో విశాఖకు కొత్త గుర్తింపు దక్కిందని తెలిపారు.

మద్యం నాణ్యత తనిఖీ కోసం మొబైల్ యాప్

కురుపాం, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): మద్యం నాణ్యత తనిఖీ కోసం ఏపీ ఎక్సైజ్ సురక్ష అన్న యాప్ అందుబాటులోకి తీసుకొచ్చినట్లు కురుపాం ఎక్సైజ్ సీఐ పి.శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం కురుపాంలో విలేకరులతో మాట్లాడుతూ కల్తీమద్యంపై ఇటీవల వస్తున్న విమర్శల నేపథ్యంలో రూపొందించిన ఈ యాప్ గూగుల్ ప్లే స్టోర్లో డౌన్లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు.

చేతులను శుభ్రంగా కడుక్కోవాలి


కొమరాడ: చేతుల శుభ్రతపై పిల్లలకు అవగాహనకల్పిస్తున్న దృశ్యం

కొమరాడ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి):సంపూర్ణ ఆరోగ్యంగా ఉండడం కోసం ప్రతిరోజూ చేతులను శుభ్రంగా కడుక్కోవాలని సీడీపీవో జి.సుగుణకుమారి తెలిపారు. బుధవారం మండలంలోని గంగరేగువలస అంగన్వాడీ కేంద్రంలో ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవం పురస్కరించుకుని పిల్లలకు చేతులు కడిగే పద్ధతులను వివరించారు. కార్య క్రమంలో ఐ.శారద, అనురాధ, సుజాత పాల్గొన్నారు.

●గుమ్మలక్ష్మీపురం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గుమ్మలక్ష్మీపురంలో విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్, యునిసెఫ్ సహకారంతో, మహిళా శిశుసంక్షేమశాఖ సమన్వయంతో ప్రపంచచేతుల పరిశుభ్రత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చేతులు కడుక్కోవడంపై అవగాహన కల్పించే పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రభుత్వవిప్ తోయక జగదీశ్వరి, కనకదుర్గ, విజయగౌరి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీపీఆర్పై అవగాహన

గరుగుబిల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అత్యవసర సమయంలో అప్రమత్తంగా వ్యవహరిస్తే ప్రాణాలను కాపాడొచ్చని ఆయూష్ మండల వైద్యాధికారి కె.కాసులవర్మ సూచించారు. బుధవారం గరుగుబిల్లిలో సీపీఆర్ విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుండెపోటు లక్షణాలు కనిపించే సమయంలో సీపీఆర్ చేస్తే ప్రాణాపాయం నుంచి బయటపడే అవకాశముందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జి.పైడితల్లి, వెలుగు ఏపీఎం పి.అప్పలనాయుడు, ఉపాధి ఏపీవో ఎం.ఈశ్వరమ్మలు పాల్గొన్నారు.

విద్యార్థినులకు పోషకాహారంపై..

కురుపాం, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): స్థానిక కేజీబీవీ, జడ్పీ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ బాలికా దినోత్సవం పురస్కరించకుని బాలికల హక్కులు,పోషకాహారం, బాల్య వివాహాలు వల్ల కలిగే నష్టాలు, వ్యక్తి గత పారిశుధ్యంపై విద్యార్థినులకు కురుపాం ఐసీడీఎస్ సీడీపీవో జి.రజినీ దుర్గా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, ఆటలపోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో ఎన్.సత్యనారాయణ, కేజీబీవీ ప్రత్యేకాధికారి ఐ.కిరణ్కుమారి, శంకరరావు, డీసీపీవో యూనిట్ లీగల్ ఆఫీసర్ శ్రీధర్, హరి కృష్ణ, సూపర్వైజర్లు జానకమ్మ,రామలక్ష్మి పాల్గొన్నారు.

108 సేవలను వినియోగించుకోవాలి


పాలకొండ: అంబులెన్స్లో రికార్డులు పరిశీలిస్తున్న మహ్మద్ గౌస్ బాషా

పాలకొండ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): 108 సేవలను వినియోగించుకోవాలని రాష్ట్ర 108 ప్రోగ్రాం మేనేజర్ మహ్మద్ గౌస్భాషా కోరారు. ఈ మేరకు బుధవారం పాలకొండ ఏరియా ఆసుపత్రిలో ఉన్న 108 నవజాతా శిశు అంబులెన్స్లో రికార్డులు, పరికరాలు, మందులను పరిశీలిం చారు. ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ చిరంజీవిని కలిశారు. కార్యక్రమంలో జిల్లా మేనేజర్ ఎస్.మన్మథనా యుడు, డివిజన్ అధికారి గిరిబాబు, 108 సిబ్బంది గణపతి, శ్రీనివాస్, రమణ, మురళీ, అనంతరావు పాల్గొన్నారు.

●సీతానగరం,అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): సీతానగరం పీహెచ్సీలోగల 104 వాహనాన్ని 104 జిల్లా మేనేజర్ ఎస్.కృష్ణ బుధవారం పరిశీలించారు. మందులకొరత లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. వాహనాల కండిషన్ను ఎప్పటికప్పుడు పరిశీలించాలని తెలిపారు.

ప్రతిఒక్కరిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దండి

వీరఘట్టం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఎంపీడీవో వెంకటరమణ కోరారు.బుధవారం స్థానిక వెలుగుసమావేశ మందిరంలో ఉల్లాస్పై శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీవో జి.సత్యంనాయుడు పాల్గొన్నారు.

●పాలకొండ, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి):స్థానిక నగరపంచాయతీ కార్యాలయంలో కమిషనర్ రత్నంరాజు, సీఎంఎం దానాలమ్మ ఆధ్వర్యంలో వలంటర్ టీచర్లకు అక్షరాంధ్ర (ఉల్లాస్)పై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అక్షరాంధ్ర ధ్యేయంగా ప్రభుత్వం నిరక్షరాస్యులైన వయోజనులకు విద్యనందించేందుకు చర్యలు చేపట్టిందన్నారు.

●సీతానగరం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి):ఉల్లాస్ అక్షరాంధ్ర లక్ష్యాలను నెరవేర్చి వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడంలో వలంటీర్లు కీలక పాత్ర పోషించాలని ఎంపీడీవో ఎంఎల్ఎస్ ప్రసాద్, వెలుగు ఏపీఎం భారతిలు పిలుపునిచ్చారు. సీతానగరం ఎంపీడీవో కార్యాలయంలో మొదటివిడతగా 240 మంది వలంటీర్లకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 27 నుంచి మ్యాపింగ్ చేసిన నిరక్షరాస్యులను వందరోజుల్లో అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో బాలకృష్ణ, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

పాలకొండ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాని ఏఎస్ఐ ఝాన్సీబాయి కోరారు. బుధవారం పాలకొండ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో శక్తిటీం ఆధ్వర్యంలో శక్తియాప్పై అవగాహన కల్పించారు. కార్య క్రమంలో శక్తిటీం సభ్యులు రాము, గిరి ప్రసాద్ పాల్గొన్నారు.

వాతావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి

భామిని, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి):వాతావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ భాగస్వా ములు కావాలని వెలుగు స్వచ్ఛంద సంస్థ రిసోర్స్పర్సన్ పి.నాగేశ్వరరావు కోరారు. బుధవారం పాలవలస పంచాయతీలోని బుచ్చిమానుగూడ గ్రామంలో వాతావరణం మార్పు ప్రభావాలపై రైతులకు అవగాహన నిర్వహించారు. కార్య క్రమంలో బిచ్చుమానుగూడ, కోసిమానుగూడ రైతులు, వెలుగు అసోసియేషన్ నుంచి కె.శారద, కె.శైలజ పాల్గొన్నారు.

రైతుల ఆర్థికాభివృద్ధికి ప్రణాళికలు

గరుగుబిల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం సాగు చేస్తున్న రైతుల ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామని రాష్ట్ర రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ టి.బాబూరావునాయుడు తెలిపారు. బుధవారం తోటపల్లి జట్టు ట్రస్ట్ కార్యాలయ ఆవరణలో ప్రకృతి వ్యవసాయ కార్యకర్తల పనితీరును సమీక్షించారు. కార్యక్రమంలో జట్టు సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ డి.పారినాయుడు, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ శ్రావణ్కుమార్, సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.ప్రహరాజ్, సిలబస్ కన్సల్టెంట్ టి.శివాజీ, రాష్ట్ర రిసోర్స్పర్సన్ పి.దేవుళ్లు, ఉత్తరాంధ్ర రీజినల్ టెక్నికల్ అధికారిర జి.హేమసుందర్, రచయిత ఆర్.వాసుదేవరావు, ఎం.నూకంనాయుడు పాల్గొన్నారు.

ఇన్చార్జి ఏపీవోగా గణేష్

సీతంపేట రూరల్,అక్టోబర్ 15(ఆంధ్రజ్యోతి):సీతంపేట ఐటీడీఏ ఇన్చార్జి ఏపీవోగా పీహెచ్వో ఆర్వీ గణేష్కు అదనపు బాధ్యతలను ఐటీడీఏ ఇన్చార్జి పీవో పవార్స్వప్నిల్ జగన్నాథ్ అప్పగించారు. ఇంతవరకు ఏపీవోగా విధులు నిర్వహించిన జి.చిన్నబాబు వ్యక్తిగత పనులపై సెలవుపై వెళ్లారు.

అబ్దుల్ కలాం జీవితం మార్గదర్శకం


గరుగుబిల్లి: నాగూరులో అబ్దుల్ కలామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

యువతకు మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జీవితం మార్గదర్శకమని వక్తలు తెలిపారు. బుధవారం జిల్లాలోని విద్యాసంస్థలు, కార్యాలయాల్లో అబ్దుల్ కలాం జయంతి పురస్కరించుకుని నివాళులర్పించారు.

పాలకొండ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూలమాలలు వేశారు.ఈ సందర్భంగా కళాశాలల జరిగిన సెమినార్లో వ్యాసరచన, వృక్తత్వ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్య క్రమంలో ప్రిన్సిపాల్ శ్యాంబాబు, వైస్ ప్రిన్సిపాల్ జయమణి, రాఘవేం ద్రనాయుడు, కె. శ్రీనివాసరావు, పి.రాజ్యలక్ష్మి, జగన్మోహన్రావు, ఎ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

●గరుగుబిల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగూరు జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్ విగ్రహానికి కొప్పల వెలమ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ ఎ.మధుసూదనరావు, హెచ్ఎం శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

తోటపల్లి ఆలయానికి రూ.5.15 లక్షల ఆదాయం

గరుగుబిల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి):తోటపల్లిలోని వేంకటేశ్వర, కోదండరామ స్వామి ఆలయాల్లో జిల్లా దేవాదాయశాఖ ప్రతినిధి బి.అప్పలనాయుడు పర్యవేక్షణలో బుధవారం హుండీలను లెక్కించారు. ఈ సందర్భంగా దేవస్థానం ఈవో వీవీ సూర్య నారాయణ మాట్లాడుతూ 97 రోజులకు స్వామివారికి కానుకల రూపంలో రూ. 5,15,792లు, అలాగే ఐదు గ్రాముల 100 మిల్లీ గ్రాములు బంగారం, వెండి 4.50 కిలోలు వచ్చినట్లు చెప్పారు.అలాగే కోదండరామస్వామి దేవస్థానానికి సంబంధించి రూ. 3,526లు కానుకల రూపంలో వచ్చినట్లు చెప్పారు.

పథకాలకు స్మార్టుకార్డే ప్రామాణికం

మక్కువ రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఇకపై అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలకు స్మార్టుకార్డే ప్రామాణికంగా తీసుకోనున్నట్లు తహసీల్దార్ కె.భరత్కుమార్ తెలిపారు. బుధవారం ఎ.వెంకంపేటలో టీడీపీ మండలాధ్యక్షుడు గుల్ల వేణుగోపాలనాయుడు ఆధ్వర్యంలో స్మార్టుకార్డులను పంపిణీ చేశారు.

● కురుపాం రూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మొండెంఖల్లో స్మార్ట్రైస్ కార్డుల పంపిణీ చేశారు.ఈ సందర్భంగా బ్రాహ్మణకార్పొరేషన్ డైరక్టరు రంజిత్ కుమార్ నాయికో కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు బలరాం, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు రైతు సంఘం మహాసభ

పాలకొండ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పాలకొండలో పార్వతీపురం మన్యం జిల్లా తొమ్మిదో మహాసభ గురువారం జరగనుందని ఏపీ రైతు సంఘ నాయకులు ఖండాపు ప్రసాదరవు తెలిపారు. బుధవారం పాలకొండ విలేకరులతో మాట్లాడుతూ గురువారం ఉదయం పది గంటలకు కోటదుర్గమ్మ ఆలయానికి రైతులు చేరుకోవాలని కోరారు.

యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలి

సీతంపేట రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ పరిధిలోని 20సబ్ప్లాన్ మండలాల్లో ఉన్న గిరిజన యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలని పీహెచ్వో ఆర్వీ గణేష్ కోరారు. స్థానిక ఐటీడీఏలో పీహెచ్వోకార్యాలయంలో సబ్ప్లాన్ మండలాల్లోని రైతు ఉత్పత్తిదారుల సంఘాలతో గిరిజన పద కాల ప్రణాళికలపై సమావేశం నిర్వహించారు.

కనీస వేతనం చెల్లించాలి

బొబ్బిలి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి ఆర్టీసీ కాంప్లెక్స్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు కనీస వేతనం చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పి.శంకరరావు కోరారు. బుధవారం బొబ్బిలి ఆర్టీసీ బస్స్టేషన్లో పారిశుధ్య కార్మికులతో కలిసి మాట్లాడారు.

మరో విద్యార్థి మృతి

(ఏడో పేజీ తరువాయి)

చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పాఠశాల హెచ్ఎం వెంటనే బాలుడిని శంబర పీహెచ్సీకి పంపగా అక్కడి వైద్యుల సూచన మేరకు సాలూరు సీహెచ్సీకి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి వెంటనే విజయనగరం ఘోషాసు పత్రికి రెఫర్ చేశారు. అక్కడ వైద్యపరీక్షలు నిర్వహించిన తర్వాత చిన్నారికి కిడ్నీలో ఏదో సమస్య ఉందని వైద్యులు తేల్చారు. ఈ నేపథ్యంలో వారి సూచనల మేరకు మంగళ వారం రాత్రి సుమారు 1.30 గంటల సమ యంలో విద్యార్థిని విశాఖ కేజీహెచ్కు తరలించారు. అక్కడి వైద్యులు చికిత్స ప్రారంభించినప్పటికీ ఫలితం లేకపోయింది. బుధవారం తెల్లవాజామున 4గంటల సమ యంలో చిన్నారి ప్రాణాలు కోల్పోయినట్లు ఆశావర్కర్ అమ్మాజమ్మ తెలిపారు. కాగా తమ బిడ్డ మృతిని తల్లిదండ్రులు జీర్ణించుకోలేక పోతున్నారు. దేవుడు తమకు అన్యాయం చేశాడని భోరున విలపిస్తున్నారు. తమ కుమారుడికి ప్రభుత్వ ఆసుపత్రిలో సరైన వైద్యసేవలు అందలేదని వారు ఆరోపిస్తున్నారు.

అధికారులే బాధ్యత వహించాలి..

చిన్నారి మృతిపై రైతుకూలీ సంఘం, సీపీఎం నాయకులు విచారం వ్యక్తం చేశారు. గిరిజన విద్యార్థుల వరుస మరణాలకు అధికారులే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. మర ణించిన వారి కుటుంబాలకు ఆర్థిక సాయమందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులు వచ్చే వరకు దహన సంస్కారాలు చేయబోమని వారు పట్టుబట్టారు. ఈ విషయం తెలుసుకున్న పార్వతీపురం ఐటీడీఏ గిరిజన సంక్షేమ శాఖ డీడీ విజయ శాంతి హుటాహుటిన మూలవలస చేరుకున్నారు. విద్యార్థి తల్లిదండ్రులను పరామర్శించా రు. అనారోగ్యంతో మరణిస్తున్న గిరిజన విద్యా ర్థుల విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేటట్లు చూస్తామని హామీ ఇచ్చారు. దీంతో ప్రజాసంఘాల నాయకులు శాంతించారు. ఆ తర్వాత చిన్నారి అంత్యక్రియ లు నిర్వహించారు. గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణి ఇచ్చిన హామీ మేరకు ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో వెంటనే ఏఎన్ఎంలను నియమించాలని వారు డిమాండ్ చేశారు.

గమ్మత్తుగా శస్త్రచికిత్స

(ఏడో పేజీ తరువాయి)

చేయగలుగుతున్నారు. శస్త్ర చికిత్సల వెనుక కనిపి ంచని హీరోలుగా అనస్థీషియా వైద్యులను పేర్కొంటారు.

ప్రాణ రక్షక ప్రక్రియ..

అనస్థీషియా అనేది కేవలం నొప్పిని తగ్గించే మందు కాదు. ఇది ప్రాణ రక్షక ప్రక్రియ. శస్త్ర చికిత్సల సమయంలో రోగి నొప్పిని మాత్రమే కాకుండా ఆందోళన, భయం హృదయ స్పందన వంటి ప్రతి చర్యలను నియంత్రిస్తుంది. ఒక రోగి శస్త్ర చికిత్సకు వెళ్లేటప్పుడు ఆయన శరీరం, మనస్సు పూర్తిగా సుర క్షితంగా ఉండేలా చూసే వ్యక్తి అనస్థీషియా వైద్యుడు మాత్ర మే. అనస్థీషియా ముందు రోగి వైద్య చరిత్ర, అలర్జీలు, గుండె లేదా ఊపిరితిత్తుల సమస్యలు ఉంటే తప్పనిసరిగా తెలియజేయాలి. అలా చేస్తే ప్రమాదాలను పూర్తిగా నివారించవచ్చును. ఇప్పుడు ఆధునిక అనస్థీషియా పద్ధతులు సురక్షితమైనవి.

-డాక్టర్ జయధీర్బాబు, హెచ్ఓడీ, డిపార్ట్మెంట్ ఆఫ్ ఎనస్థీషియాలజీ, విజయనగరం

నియోజకవర్గానికి ఒక ఎంఎస్ఎంఈ పార్క్

(ఏడో పేజీ తరువాయి)

ట్రాక్టర్ కొనుగోలు చేయాలన్నారు. రోడ్లపై ఉన్న పాడైన వాహనాలకు సంబంధించి నోటీసులు అందించాని ఆదేశించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రత్నకుమార్ తదితరులున్నారు.

ఆదికర్మ యోగి అభియాన్కు పిలుపు

న్యూఢిల్లీ విజ్ఞాన్ భవనంలో ఈ నెల 17న జరగనున్న ఆదికర్మ యోగి అభియాన్ సమావేశంలో జిల్లా నుంచి కలెక్టర్ ప్రభాకర్రెడ్డి పాల్గొనున్నారు. ఈ మేరకు గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖ నుంచి ఆయనకు ఆహ్వానం అందింది. గిరిజనుల ఉపాధిలో నూతన విధానాలపై కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు.

ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలి

పాలకొండ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని ఎంప్లాయీస్ యూనియన్ జోనల్ కార్యదర్శి భాసూరు కృష్ణమూర్తి కోరారు.ఈమేరకు బుధవారం విజయనగరంలో జోనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బ్రహ్మానందరెడ్డికి ఈయూ నాయకులు కె.శ్రీనివాసరావు, మూర్తి, నారాయణ, పద్మ, ప్రసాద్, తౌడయ్య, లత, రవికాంత్తో కలిసి వినతిపత్రం అందజేశారు.


వినతిపత్రం అందజేస్తున్న ఈయూ నాయకులు

సిబ్బందిని భర్తీ చేస్తాం

కొత్తవలస, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): కొత్తవలస పోలీసు స్టేషన్‌లో సిబ్బందిని భర్తీ చేయడానికి కృషి చేస్తానని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. కొత్తవలస పోలీసు స్టేషన్‌కు ఆయన బుధవారం తనిఖీ చేశారు. ఇక్కడ కొంతవరకు పోలీసు సిబ్బంది కొరత ఉన్నట్టు తెలిసిందని, భర్తీ చేయిస్తానని తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

పోలీసు సేవలు భేష్



ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే కళా

రాజాం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లా శాంతి భద్రతలు కాపాడడంలో పోలీసు సేవలు భేష్ అని చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు అన్నారు. బుధవారం ఆయన ఎస్పీ దామోదర్‌ను కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. ఎస్పీగా పదవీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలు తలెత్త కుండా తగు చర్యలు చేపడుతున్నారని కొనియాడారు.

హక్కుల సాధనకు రేపు ధర్నా

వేపాడ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగంలో కల్పించిన హక్కుల సాధనకు ఈనెల 17న అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రం సారథ్యంలో మహాధర్నా నిర్వహిస్తున్నట్టు బహుజన కళామండలి నాయకుడు ఆతవ ఉదయ భాస్కర్, కళా మండలి సభ్యులు ఆతవ నాగరాజు, డప్పు రాజులు తెలిపారు. ఆతవ గ్రామంలో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు అమలు చేయాలని, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పోస్టర్ ఆవిష్కరించారు.

నేడు డయల్ యువర్ డీపీటీవో

విజయనగరం రింగురోడ్డు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): డయల్ యువర్ డీపీటీవో కార్యక్రమాన్ని గురువారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకూ నిర్వహిస్తున్నట్టు జిల్లా ప్రజా రవాణాధికారి జి.వరలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిధిలోగల ప్రయాణికులు తమ సలహాలు, సూచనలు, సమస్యలపై 9959225604 నెంబరుకు ఫోన్ చేయాలని సూచించారు.

ఫైలేరియా యూనిట్ తనిఖీ

విజయనగరం రింగురోడ్డు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అర్బన్ ఫైలేరియా యూనిట్‌ను రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డా.వరుణ్ మంగళవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో నిర్వహించే క్లినిక్ కార్యకలాపాలు, ఫైలేరియా వ్యాధిగ్రస్థులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. వ్యాధిగ్రస్థులతో మాట్లాడి, అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. సీనియర్ ఎంటామలజిస్ట్, అర్బన్ ఫైలేరియా యూనిట్ సిబ్బంది పాల్గొన్నారు.

19న యోగాసనాల పోటీలు

నెల్లిమర్ల, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక మిమ్స్ సమీపంలోని శ్రీరామకృష్ణ ధ్యాన మందిరంలో ఈనెల 19న జిల్లా స్థాయి యోగాసనాల పోటీలు నిర్వహిస్తున్నట్టు జిల్లా యోగా క్రీడా సంఘం ప్రతినిధులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలకు 25, 26వ తేదీల్లో విశాఖపట్టణంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామన్నారు. పోటీల్లో పాల్గొనేవారు తమ పేర్లను 17వ తేదీలోగా 8374904262, 8465954998లకు సంప్రదించి నమోదు చేసుకోవాలన్నారు.

విద్యార్థుల్లో ఆవిష్కరణాత్మక ఆలోచన పెంపొందాలి

డెంకాడ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో ఆవిష్కరణాత్మక ఆలోచన పెంపొందాలని లెండి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ వీవీ రామారెడ్డి అన్నారు. జొన్నాడ వద్దగల లెండి ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం డా.ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా నేషనల్ ఇన్నోవేషన్‌డే -2025ను నిర్వహించారు. అలాగే స్మార్ట్ ఇండియా హ్యాకథన్‌లో ఎంపికైన 50 మంది విద్యార్థుల బృందాలతో పోస్టర్ ప్రదర్శించారు. చైర్మన్ పి.మధుసూదనరావు, వైస్ చైర్మన్ శ్రీనివాసరావు, సెక్రటరీ శివరామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ హరిబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

జీఎస్టీపై అవగాహన

గజపతినగరం, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో నిత్యావసర సరుకులతో పాటు వాహనాల ధరలు తగ్గుముఖం పట్టాయని మాజీ ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి అన్నారు. బుధవారం స్థానిక బజార్ సెంటర్‌లో వర్తకులతో పాటు వినియోగదారులకు అవగాహన కల్పించారు. పీఏసీఎస్ చైర్మన్ లెంక బంగారునాయుడు, ఆంధ్ర ప్రాజెక్టు చైర్మన్ కోడి సతీష్, పార్టీ నాయకులు రామ్‌కుమార్, ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● పూసపాటిరేగ: ద్విచక్ర వాహనాలపై జీఎస్‌టీ తగ్గింపుపై మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ వెంకటరావు ఆధ్వర్యంలో బుధవారం కోనాడ జంక్షన్ వద్ద షోరూంల నిర్వాహకులతో ర్యాలీ నిర్వహించారు. జీఎస్టీ తగ్గింపులో వాహనాలతో పాటు నిత్యావసర వస్తువుల ధరలు తగ్గాయని తెలిపారు.

పెదకాదలో పశు వైద్య శిబిరం

దత్తిరాజేరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పెదకాద గ్రామంలో బుధవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. జాతీయ గోకుల్ మిషన్‌లో భాగంగా సుమారు 52 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్సలు చేసి చూడి తనిఖీలు చేపట్టారు. సుమారు 16 పశువులకు రక్తపరీక్షలు చేపట్టారు. అనంతరం పాడి రైతులకు ఉచితంగా మందులు అందజేశారు. గజపతినగరం సహాయ సంచాలకులు చంద్రశేఖర్, పశు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య కళాశాలను పూర్తి చేయాలి

● కలెక్టర్ రామసుందర్ రెడ్డి

విజయనగరం కలెక్టరేట్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య కళాశాల పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ రామసుందర్ రెడ్డి ఆదేశించారు. మెడికల్ కళాశాల నిర్మాణం, ఇతర అంశాలపై బుధవారం ఆయన తన చాంబర్‌లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. ప్రస్తుత భవనాల నిర్మాణ పరిస్థితి, ఆసుపత్రి, హాస్టల్ భవనాల నిర్మాణంపై ఆరా తీశారు. భవనాలను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిపై సమీక్షించారు. ఆసుపత్రి మరమ్మతులకు, లోపల రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేయాలని ఏపీఎంఎస్ఐడీసీని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ దేవి మాధవి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.పద్మజ, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ భారతి తదితరులు ఉన్నారు.

పీఎంఏవై గృహాలను ప్రవేశాలకు సిద్ధం చేయాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రామసుందర్‌రెడ్డి

పీఎంఏవై కింద మంజూరైన గృహాలను త్వరగా పూర్తి చేసి గృహ ప్రవేశాలకు సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ రామసుందర్ రెడ్డి ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయా శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఎంఏవై కింద జిల్లాలో 8,259 గృహాలు లక్ష్యం కాగా.. 6,873 గృహాలు ఇప్పటికే పూర్తయ్యాయని, మిగిలిన 1,386 గృహాలను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ముందుగా అర్బన్‌లో సొంత స్థలాలు ఉన్న గృహాలను పూర్తి చేయాలన్నారు. రూఫ్ లెవల్‌లో ఆర్సీ స్థాయిలో ఉన్నవన్నీ పూర్తి కావాలని, ఇకపై ప్రతి వారం సమీక్షిస్తామని తెలిపారు. కాలనీలో నిర్మాణాలకు అనువుగా ఉన్నవాటిని గుర్తించి, అందుకు ఎంత మేరకు భూమి అవసరం పడుతుందో.. ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. ఈ సమావేశంలో హౌసింగ్ పీడీ మురళీ ప్రసాద్, డీఈలు పాల్గొన్నారు.

పారిశ్రామిక భాగస్వామ్య డ్రైవ్ ప్రారంభం

ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేష న్ ఆధ్వర్యంలో ఏపీఐఐసీ -పారిశ్రామిక భాగస్వామ్య డ్రైవ్ పేరుతో నెల రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. నెలరోజుల పాటు జరిగే ఈ కార్యక్రమానికి సంబంధించి పోస్టరును బుధవారం సాయంత్రం కలెక్టర్ తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ డీజెడీఎం జయచంద్ర, జేఈవీ రాజేష్‌కుమార్ పాల్గొన్నారు.

వసతిగృహాల్లో సమస్యలను పరిష్కరించాలి

విజయనగరం రూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): నగరంలోని కస్పా హైస్కూల్‌లో బుధవారం విజయనగరం నియోజకవర్గ పరిధిలో ఉన్న వసతిగృహాల సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే అదితి గజపతిరాజు పాల్గొని, మాట్లాడారు. వసతిగృహాల్లో సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. మెనూ సక్రమంగా అమలు చేయాలని కోరారు. ప్రభుత్వ స్థాయిలో పరిష్కరించాల్సిన సమస్యలను తాను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్తానని చెప్పారు.

జీఎస్టీ ఎగ్జిబిషన్ పరిశీలన

ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో ఏర్పాటుచేసిన సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ ఎగ్జిబిషన్‌ను ఎమ్మెల్యే అదితి గజపతిరాజు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుతో అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనం కలుగుతున్నదన్నారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి భరోసా



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే అదితి

విజయనగరం రూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): నగరంలోని 14వ డివిజన్‌లో టీడీపీ సభ్యత్వం ఉన్న అల్లాడ ఆనంద్ ఇటీవల చనిపోగా, ఆయన కుటుంబ సభ్యులకు పార్టీ అందించిన రూ.5లక్షల చెక్కును, పత్రాన్ని ఎమ్మెల్యే అందజేశారు. టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవీపీ రాజుతో పాటు, నగర అధ్యక్ష, కార్యదర్శులు గంటా రవి, పీతల కోదండరామ్, 14వ డివిజన్ ఇన్‌చార్జి మద్దాల నాగమ్మ పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్ పరిశీలన

విజయనగరం టౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పేదలకు అన్నా క్యాంటీన్ ఒక అక్షయపాత్రగా ఉపయోగపడుతుందని కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య అన్నారు. నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా నిర్వహిస్తున్న అన్నా క్యాంటీన్‌ను ఆయన బుధవారం సందర్శించారు. క్యాంటీన్‌లో అల్పాహారం తింటున్న వారితో మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో మూడు అన్నా క్యాంటీన్లను నిర్వహిస్తున్నామని, నిత్యం 15వందలకు పైగా ఇక్కడ భోజనం చేస్తున్నారని చెప్పారు. ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు రానీయకుండా ఆహారాన్ని అందిస్తున్నామన్నారు.

రైతులకు పెద్దపీట

మెరకముడిదాం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రైతులకు పెద్దపీట వేస్తుందని చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు అన్నారు. బుధవారం బైరిపురం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా తాడ్డి చంద్రశేఖర్, వైస్ చైర్మన్ శివప్రసాద్‌ల ప్రమాణస్వీకార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. బైరిపురం మార్కెట్‌యార్డు అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తాడ్డి సన్యాసినాయుడు, మాజీ ఎంపీపీ కోట్ల మోతీలాల్ నాయుడు, పార్టీ నాయకులు ధనంజయ, రమణమోహనరావు తదితరులు పాల్గొన్నారు.

గూగుల్ రాకతో విశాఖలో టెక్ విప్లవం

● డీసీసీబీ చైర్మన్ నాగార్జున



మాట్లాడుతున్న నాగార్జున

చీపురుపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గూగుల్ రాకతో విశాఖపట్నంలో టెక్ విప్లవం మొదలయ్యిందని.. ఈ క్రెడిట్ ముఖ్యమంత్రికి దక్కుతుందని డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున అన్నారు. బుధవారం ఆయన చీపురుపల్లిలో విలేకర్లతో మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో మైక్రోసాఫ్ట్ వంటి సంస్థలను హైదరాబాద్‌కు తెచ్చినట్టు చంద్రబాబునాయుడు విశాఖపట్నానికి టెక్ దిగ్గజాలను తీసుకువస్తున్నారన్నారు. వీటితో ఆంధ్రప్రదేశ్ ముఖ చిత్రం మారుతుందన్నారు. దేశంలోనే అత్యుత్తమంగా 26 పాలసీలను రూపొందించి, సంస్థల నిర్మాణానికి ఎటువంటి ఆటంకాలు లేకుండా సింగల్ విండో విధానంలో క్లియరెన్సులు ఇస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 16 నెలల్లోనే 11.20 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయని, 9.5 లక్షల మందికి ఉద్యోగావకాశాలు దక్కాయని నాగార్జున అన్నారు.

మంత్రి లోకేశ్ సమర్థతతోనే..



మాట్లాడుతున్న బాబూరావు

ఐటీ మంత్రి నారా లోకేశ్ సమర్థతతోనే విశాఖకు గూగుల్ సంస్థ వచ్చిందని మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు అన్నారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. గూగుల్ సంస్థను విశాఖపట్నం రప్పించడంలో లోకేశ్ జరిపిన కృషిని ప్రధాని మోదీ సైతం మెచ్చుకున్నారన్నారు. రానున్న రెండు మూడు నెలల్లో ప్రపంచ స్థాయి సంస్థలు విశాఖకు క్యూ కడతాయని గద్దే అన్నారు. నారా లోకేశ్ నేతృత్వంలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధిస్తుందన్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థులకు బంగారు భవిష్యత్తు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జేఎన్‌టీయూ డీఈ బాబులు

గరివిడి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఉందని విజయనగరం జేఎన్‌టీయూ డీఈ ప్రొఫెసర్ కె.బాబులు అన్నారు. బుధవారం గరివిడిలోని అవంతీస్ సెయింట్ థెరీసా ఇంజనీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ జె.బాలభాస్కరరావు ఆధ్వర్యంలో ఫ్రెషర్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న బాబులు మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రం, దేశం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతోందని, ఈ నేపథ్యంలో ఇంజనీరింగ్ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా లభిస్తున్నాయన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. బీఎస్ఎన్ఎల్ జిల్లా డీజీఎం డి.దాలినాయుడు, చీపురుపల్లి ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.విజయలక్ష్మి, మాజీ మంత్రి అవంతి శ్రీనివాసరావు, గరివిడి బ్రహ్మకుమారి ఓంశాంతి ఇన్‌చార్జి లతక్క, అవాంతి విద్యాసంస్థల ప్రతినిధి ఎం.మహేష్, ఏవో జి.అనిల్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంధ్రజ్యోతి వార్షికోత్సవం



కేకను కట్ చేస్తున్న ఎంపీ కలిశెట్టి

విజయనగరం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఏబీఎన్-ఆంధ్రజ్యోతి సంస్థల వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై నిత్యం పోరాటం చేస్తున్న ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ సంస్థలు ప్రజాదరణ చూరగొంటున్నాయన్నారు. భవిష్యత్తులో కూడా పాఠకుల ఆదరణతో ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

అబ్దుల్‌కలాం కలలను సాకారం చేయాలి



అవార్డు గ్రహీతలను సన్మానిస్తున్న దృశ్యం

గజపతినగరం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం కలలను సాకారం చేయాలని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు అన్నారు. బుధవారం మరుపల్లి గ్రామంలో బాలాజీ పాల్ టెక్నికల్ కళాశాల అధినేత రెడ్డి చంద్రశేఖర్, పావని ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు సన్మానం చేశారు. ముందుగా అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీతోపాటు ఉచిత క్యాన్సర్, కిడ్నీ డయాలసిస్ ఆసుపత్రి నిర్వాహకులు దివ్యామృత సాయి స్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గౌరవ అతిథులుగా దామోదర సంజీవయ్య, జాతీయ లా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ బి.సూర్యప్రకాషరావు, ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ముర్రు ముత్యాలనాయుడు, ఆర్‌జేడీ విజయ్‌భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్సులు రద్దు చేస్తాం



బొబ్బిలి: మాట్లాడుతున్న డీఎస్పీ భవ్యారెడ్డి

బొబ్బిలి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగకు బాణసంచా విక్రయించే వ్యాపారులు నిబంధనలు పాటించాలని.. లేదంటే లైసెన్సుల రద్దుకు సిఫారసు చేస్తామని డీఎస్పీ భవ్యా రెడ్డి హెచ్చరించారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో బుధవారం సాయంత్రం బొబ్బిలి పోలీసు సబ్‌డివిజన్ పరిధిలో గల బాణసంచా వ్యాపారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ... దుకాణదారులు, తయారీదారులు నిబంధనలను ఉల్లంఘిస్తే లైసెన్సులను రద్దు చేయాలని కలెక్టర్‌కు సిఫారసు చేస్తామన్నారు. నివాస ప్రాంతాలకు దూరంగా బాణసంచాను ఉంచాలని సూచించారు. బాణసంచా గోదాములు, మిక్సింగ్ షెడ్లు, స్టోరేజీ యూనిట్లలో శిక్షణ పొందిన కార్మికులను నలుగురిని మాత్రమే నియమించాలని.. వారికి బీమా చేయించాలని తెలిపారు. తాత్కాలిక లైసెన్సులు పొందిన తర్వాత మాత్రమే బాణసంచా నిల్వలను సిద్ధం చేసుకోవాన్నారు. ఈ సమావేశంలో బొబ్బిలి టౌన్, రూరల్ సీఐలు కటకం సతీష్ కుమార్, కె.నారాయణరావు, గజపతినగరం సీఐ వెంకటరమణ సబ్‌డివిజన్ పరిధిలో గల ఎస్ఐలు, వ్యాపారులు పాల్గొన్నారు.

బాణసంచా తయారీ కేంద్రం పరిశీలన

గుర్ల, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): దేవునికనపాక పంచాయతీ గవిడిపేట గ్రామంలో ఉన్న బాణసంచా తయారీ కేంద్రాన్ని డీఎస్పీ రాఘవులు బుధవారం పరిశీలించారు. ఎటువంటి ప్రమాదాలు జరగకుండా భద్రతా ప్రమాణాలు పాటించాలని ఆయన సూచించారు. ఆయన వెంట చీపురుపల్లి సీఐ శంకరరావు, గరివిడి, గుర్ల, చీపురుపల్లి ఎస్ఐలు నారాయణరావు, దామోదరరావు, లోకేష్ ఉన్నారు.

అనుమతి లేకుండా విక్రయిస్తే చర్యలు

బాడంగి: అనుమతి లేకుండా బాణసంచా విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఆర్డీవో రామ్మోహనరావు హెచ్చరించారు. బుధవారం మండలంలోని ఎరుకలపాకల్లో అమ్మాభగవాన్ మందుగుండు సామగ్రి తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. తాగునీరు, కార్బన్‌డైఆక్సైజ్ సిలిండర్లను అందుబాటులో ఉంచాలని కోరారు. మందుగుండు సామగ్రి తయారీ నిర్వాహకుడు పాలవలస గౌరు ఆర్డీవోకు కర్మాగారంలో యూనిట్ల చూపించారు. ఆయనవెంట తహసీల్దార్ వరప్రసాద్, ఎస్ఐ తారకేశ్వరరావు, అగ్నిమాపక, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

సురక్ష యాప్‌ను వినియోగించుకోవాలి



గజపతినగరం: మద్యం సీసాను పరిశీలిస్తున్న సీఐ

గజపతినగరం/ దత్తిరాజేరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మద్యం షాపుల్లో కల్తీ మద్యం అమ్మకాలకు ఆస్కారం లేకుండా ప్రభుత్వం అమల్లోకి తీసుకువచ్చిన ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌ను వినియోగదారులు వినియోగించుకోవాలని ఎక్సైజ్ శాఖ సీఐ జనార్దనరావు అన్నారు. సర్కిల్ పరిధిలో గల 16 మద్యంషాపులను ఆయన బుధవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ యాప్ ద్వారా మద్యం సీసాపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్‌చేస్తే ఆ బాటిల్ సమాచారం తెలుసుకోవచ్చునని సూచించారు. గత అక్టోబరు నుంచి నేటి వరకు 106 మద్యం నమూనాలు సేకరించామని తెలిపారు. మద్యం నాణ్యత లోపించినట్లయితే వినియోగదారులు 14405కు ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు. ఎస్ఐ పి.నరేంద్రకుమార్, పి.శాంతి లక్ష్మి, సిబ్బంది బాషా, అప్పారావు పాల్గొన్నారు. ● రాజాం: మద్యం నాణ్యత తనిఖీ కోసం ఎక్సైజ్ శాఖ సురక్ష మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిందని రాజాం ఎక్సైజ్ సీఐ ఆర్ జైభీమ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏమైనా ఫిర్యాదులు ఉంటే 14405కి గానీ 9000248926 నెంబర్లకు గానీ తెలియజేయాలని సూచించారు. ● నెల్లిమర్ల: వినియోగదారులు నాసిరకం మద్యం తాగకుండా ఉండేందుకు ప్రత్యేక యాప్‌ను రూపొందించినట్టు నెల్లిమర్ల ఎక్సైజ్ సీఐ ఎం.వెంకటరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. లిక్కర్ నాణ్యతపై ఏమైనా ఫిర్యాదులు ఉంటే 14405 నెంబరుకు తెలియజేయాలని ఆయన సూచించారు.

పార్వతీపురంలో ఫొటోషూట్‌కు వెళుతూ..

● రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఆమదాలవలస, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): బూర్జ మండలం నీలంపేట జంక్షన్ వద్ద బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో కె.సంతోష్ (19) మృతి చెందినట్టు బూర్జ పోలీసులు తెలిపారు. ఆ వివరాలిలా ఉన్నాయి.. విజయనగరం జిల్లా గరివిడి మండలం పేరిపేట గ్రామానికి చెందిన సంతోష్ తన స్నేహితుడు, గాజువాకకు చెందిన నమ్మి కనకరాజుతో కలిసి ద్విచక్ర వాహనంపై శ్రీకాకుళం నుంచి పార్వతీపురం వెళుతున్నాడు. ఫొటోగ్రాఫర్లు అయిన వీరు పార్వతీపురంలో ఓ ఫొటోషూట్ కోసం వెళ్తుండగా.. నీలంపేట జంక్షన్ వద్ద ప్రధాన రహదారిలో ఉన్న గోతులు తప్పించబోయి బైక్ అదుపు తప్పి పడిపోయారు. ద్విచక్ర వాహనం నడుపుతున్న సంతోష్ అక్కడికక్కడే మృతి చెందగా.. వెనుక కూర్చున్న కనకరాజుకు తీవ్రంగా గాయపడ్డాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చంపావతి నదిలో వ్యక్తి గల్లంతు

నెల్లిమర్ల, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక చంపావతి నదిలో ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి పడి గల్లంతయ్యాడు. బుధవారం స్థానికులు అందించిన వివరాల ప్రకారం.. జరజాపుపేటకు చెందిన కనకల అప్పారావు(46) థామస్‌పేట పరిధిలోని చంపావతి నదిలో దిగి గల్లంతయ్యాడు. అప్పారావు భవన నిర్మాణ పనులు చేస్తూ.. పనులు లేని సమయంలో శుభ కార్యక్రమాలకు వంటలు చేయడానికి వెళ్తుంటాడు. ఈనేపథ్యంలో థామస్‌పేట గ్రౌండ్‌లో ఓ పెళ్లికి వంట చేసేందుకు తన సహచరుడు కిల్లంపల్లి రాజుతో వెళ్లాడు. వంట పూర్తిచేసుకుని వారిద్దరూ చంపావతి నదిలో స్నానానికి దిగారు. రాజు ఒడ్డుకు చేరుకోగా.. అప్పారావు ప్రమాదవశాత్తు గల్లంతయ్యాడు. ఆ ప్రదేశంలో లోతుతోపాటు ఊబి కూడా ఉండడంతో ప్రమాదం జరిగింది. స్థానికులు నదిలో దిగి వెతికినా అప్పారావు ఆచూకీ లభ్యం కాలేదు. బాధితుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మృతదేహం లభ్యం

గంట్యాడ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని చంద్రంపేట-వసంత గెడ్డలో గల్లంతైన సోమరాజు మృతదేహం బుధవారం లభ్యమైంది. చినవసంత గ్రామానికి చెందిన విజ్జపు సోమరాజు(55) సోమవారం రాత్రి విజయనగరం నుంచి ఇంటికి వస్తుండగా చంద్రంపేట -వసంత గెడ్డలో గల్లంతైన సంగతి తెలిసిందే. మంగళవారం ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు గెడ్డలో గాలించారు. మృతదేహం లభ్యం కాకపోవడంతో బుధవారం మరోసారి గాలించారు. దీంతో మృతదేహం లభ్యమైంది. బయటకు తీసి, పంచానామ నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

చంద్రంపేట గెడ్డను పరిశీలించిన ఆర్డీవో

ప్రమాదాలకు నిలయంగా మారిన చంద్రంపేట గెడ్డను ఆర్డీవో దాట్ల కీర్తి బుధవారం పరిశీలించారు. గెడ్డలో నీటి తీవ్రతపై స్థానిక తహసీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. వర్షా కాలంలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకుంటే బాగుంటుందని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ వంతెన నిర్మిస్తే గానీ తమ కష్టాలు తీరవని స్థానికులు వెల్లడించారు.

శశ్మానవాటిక కోసం స్థల పరిశీలన

కొత్తవలస, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): అప్పన్నదొరపాలెం పంచాయతీ జోడుమెరక గ్రామానికి శశ్మానవాటిక కోసం స్థలం కేటాయిస్తున్నట్టు తహసీల్దార్ పి.అప్పలరాజు తెలిపారు. బుధవారం ఆయన అప్పన్నదొపాలెం గ్రామాన్ని సందర్శించారు. జోడుమెరక, తమ్మన్నమెరక గ్రామాల మధ్య శశ్మానవాటిక కోసం తరచూ వివాదాలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో రెల్లి రెవెన్యూలోని సర్వే నెం.25-3లో జోడుమెరక గ్రామానికి స్థలం కేటాయించడానికి సర్వే చేసినట్టు తహసీల్దార్ తెలిపారు. త్వరలోనే ఉన్నతాధికారులతో చర్చించి శశ్మానవాటికకు స్థలం కేటాయిస్తామన్నారు. సర్పంచ్ రాములమ్మ ఉన్నారు.

గ్రంథాలయ పోస్టులను భర్తీ చేయాలి

విజయనగరం దాసన్నపేట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న అన్ని రకాల గ్రంథాలయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.రామన్న హెచ్చరించారు. బుధవారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో గురజాడ లైబ్రరీ నుంచి కోట జంక్షన్ వరకూ ర్యాలీ చేశారు. అనంతరం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాళీగా ఉన్న లైబ్రరీ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి పంచాయతీ పరిధిలో డిజిటల్ లైబ్రరీ తీసుకురావాలన్నారు. డీవైఎఫ్ఐ ప్రతినిధులు సతీష్, వెంకటరమణ, ఆదిత్య, రాజు, శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఫిర్యాదులు తీసుకుని ఏం చేశారు?



రిలే దీక్ష చేస్తున్న జిందాల్ నిర్వాసితులు

ఎస్.కోట రూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరిస్తామని గ్రామసభలు పెట్టి.. ఫిర్యాదుల తీసుకుని.. ఏం న్యాయంచేశారని జిందాల్ నిర్వాసితులు ఉన్నతాధికారులను ప్రశ్నించారు. బుధవారం బొడ్డవరలో 117వ రోజు నిరసనలో భాగంగా వీరు మాట్లాడారు. తమ భూములను 18 ఏళ్ల కిం దట పరిశ్రమలకు ఇచ్చి మోసపోతే తమను ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు.

మోటారు చోరీపై కేసు

సంతకవిటి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్.రంగారాయపురం గ్రామానికి చెందిన రైతు పొగిరి సత్యంనాయుడు తన పంట పొలంలోని వ్యవసాయ పంపు సెట్‌కు సంబంధించిన విద్యుత్ మోటారును దొంగలించినట్టు ఫిర్యాదు చేశారని ఏఎస్ఐ ఎం.వాసుదేవరావు మంగళవారం తెలిపారు. అదే గ్రామానికి చెందిన ఐదుగురు వ్యక్తులపై అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదులో పేర్కొన్నారని చెప్పారు. దీనిపై కేసు నమోదు చేశామని ఏఎస్ఐ తెలిపారు.

అనధికార లేఅవుట్లను క్రమబద్ధీకరణ చేసుకోవాలి

నెల్లిమర్ల, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలో అనధికార లేఅవుట్లను క్రమబద్ధీకరణ చేసుకోవాలని కమిషనర్ టి.జయరాం కోరారు. బుధవారం స్థానిక కార్యాలయంలో అనధికార లేఅవుట్ల వివరాల నోటీసు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జరజాపుపేట పరిధిలో సర్వే నెంబరు 6పీ, 7పీ, 25పీ, 26పీ, 27పీ, 28పీ 10 ఎకరాల 91 సెంట్లు, పూడమ్మతల్లి లేఅవుట్ నెల్లిమర్ల కీర్తి వీధి వైన్‌షాపు పక్కన సర్వే నెంబరు 94/2, 3, 4, 5, 6, 7, 8, 16, 17, 18, 19, 24, 25, సర్వేనెంబరు 95పీ 5, 6, 6, 7, 8, 9లో అనధికార లేఅవుట్ క్రమబద్ధీకరణ చేసుకోవాలన్నారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కోరారు. లేఅవుట్ రెగ్యులైజేషన్ స్కీం(ఎల్ఆర్ఎస్) ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయొద్దు

విజయనగరం దాసన్నపేట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయొద్దని పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక జడ్పీ మినిస్టీరియల్ హాల్ రౌండ్ టేబిల్ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈసందర్భంగా సంక్షేమ సంఘ నాయకుడు యూఎస్ రవికుమార్ మాట్లాడుతూ, ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైద్య రంగాన్ని పూర్తిగా పీపీపీ మోడల్‌లో ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టి, ప్రభుత్వం తన బాధ్యత నుంచి తప్పుకోవడానికి చూస్తుందన్నారు. ఈ సమావేశంలో రెడ్డి శంకరరావు, ఫైజల్, వైద్యులు సురేష్‌బాబు, నవీన్ పాల్గొన్నారు.

పాడి పరిశ్రమ అభివృద్ధిపై దృష్టి సారించాలి

నెల్లిమర్ల, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పాడి పరిశ్రమ అభివృద్ధికి రైతులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని పశు సంవర్ధక శాఖ జిల్లా జేడీ డా.మురళీకృష్ణ అన్నారు. గరివిడి పశువైద్య పాలిటెక్నిక్ కళాశాల ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో మొయిద విజయరాంపురంలో ఏర్పాటుచేసిన పశు వైద్య శిబిరాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. పశువైద్యులు, గరివిడి పశువైద్య కళాశాల అధ్యాపకులు పలు పశువులను పరీక్షించి, ఉచితంగా మందులు అందజేశారు. సర్పంచ్ అట్టాడ కృష్ణ, మండల పశువైద్యాధికారి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

నెల్లిమర్ల, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక సీకేఎం ప్రభుత్వ జూనియర్ కళాశా లను ఆర్‌జేడీ శేఖర్‌బాబు బుధవారం సందర్శించారు. విద్యార్థులను ప్రీఫైనల్ పరీక్షలకు సిద్ధం చేసి ఉత్తమ ఫలితాలు సాధించడానికి కృషి చేయాలని అధ్యాపకులకు సూచించారు. జిల్లా వృత్తి విద్యా శాఖాధికారి తవిటినాయుడు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎం.మధుసూదనరావు పాల్గొన్నారు.